సాక్షి ప్రకాశం

మంగళవారం । 20 । జూన్ । 2023



అదిగో పెద్దపులి..ఇదుగో చిరుత..!

అర్ధవీడు మండలం అయ్యవారిపల్లి అటవీ ప్రాంతంలో పెద్దపులితో పాటు చిరుతపులి సంచారం కలకలం రేపుతోంది.

- 8లో..



బరితెగించిన పచ్చదండు

చర్చి వివాదంలో వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై టీడీపీ వర్గీయులు విచక్షణా రహితంగా దాడిచేశారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం

40 /31

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

డా.నాగభైరవకు సాహిత్య పురస్కారం

ఒంగోలు టౌన్: రైతు వెతలను మహాకావ్యంగా ఆవిష్కరించిన ప్రముఖ కవి డాక్టర్ నాగభైరవ ఆదినారయణకు పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ చారిటబుల్ ట్రస్ట్ 2023కుగాను సాహిత్య పురస్కారాన్ని ప్రకటించింది. ఒంగోలుకు చెందిన ఆదినారాయణ సాహిత్య రంగంలో చేస్తున్న సేవలను అభినందిస్తూ జూలై 2వ తేదీ బాపట్ల జిల్లా అద్దంకిలోని రామసుశీల నిలయంలో నిర్వహించే సాహిత్య సభలో పురస్కారాన్ని అందజేయనున్నట్లు ట్రస్ట్ చైర్మన్ పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పురస్కారంతో పాటు రూ.10 వేల నగదును బహూకరించనున్నట్లు పేర్కొన్నారు.

త్వరలో అక్షర ప్రకాశం 2.0

ఒంగోలు అర్బన్: త్వరలో అక్షర ప్రకాశం 2.0ను ప్రారంభించనున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో వయోజన విద్యపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ నగరపాలక పరిధిలో ప్రయోగాత్మకంగా 10 సచివాలయాల (పోతురాజు కాలువ, వీఎస్ కాలనీ, కోటవీధి, రంగారాయుడు చెరువు, బాలాజీరావు పేట, పీర్లమాన్యం, శివప్రసాద్ కాలనీ, తూర్పు క్రిస్టియన్‌పాలెం, రంగుతోట, రాజపానగల్ రోడ్డు)లోని స్లమ్ ఏరియాలో 15 ఏళ్ల నుంచి 60 సంవత్సరాల వయసు ఉన్న నిరక్షరాశ్యులైన వయోజనులకు అక్షర ప్రకాశం కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమానికి అధ్యక్షులుగా కలెక్టర్, కన్వీనర్‌గా మున్సిపల్ కమిషనర్, మెప్మా పీడీ, వయోజనవిద్య ఏడీలు ఉంటారన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు. దీనిలో ఓఎంసీ సహాయ కమిషనర్ వీరాంజనేయులు, మెప్మా పీడీ రవికుమార్, వయోజన విద్య ఏడీ వెంకటేశ్వరరావు, ఇతర సిబ్బంది సురేఖ, మాల్యాద్రి, జ్యోతి, శ్రీనివాసరావు, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు: ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మంగళవారం ఒంగోలులో ప్రజలు, కార్యకర్తలు, పార్టీ నాయకులకు అందుబాటులో ఉంటారని మాగుంట కార్యాలయ మేనేజర్ భవనం శ్రీనివాసరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు తన కార్యాలయంలో అందుబాటులో ఉంటారని, 6 గంటలకు స్థానికంగా జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. 21వ తేదీ ఉదయం 6 గంటలకు స్థానిక ఏబీఎం జూనియర్ కాలేజీ గ్రౌండులో జరిగే అంతర్జాతీయ యోగ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. 10.30 గంటలకు స్థానిక క్విస్ కాలేజీలో యువ ఉత్సవ్ -ఇండియా ఎట్ 2047 పేరిట నెహ్రూ యువ కేంద్ర నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం స్థానికంగా పలు కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు.

వైఎస్సార్‌సీపీలో నియామకాలు

పట్నంబజారు (గుంటూరుఈస్ట్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన సింగ్ నరసింహారావును గుంటూరు జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. బాపట్ల జిల్లాకు సంబంధించి క్రిస్టియన్ మైనార్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జిగా పట్టెం మనోహర్‌ను నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

తొలకరి.. ఊరిస్తూ..



తొలకరి ఊరిస్తోంది. రెండు రోజులుగా ఆకాశంలో మేఘాలు కమ్ముకున్నా చినుకు రాలలేదు. వేసవి తాపం తప్ప లేదు. ఆది, సోమవారాల్లో సాయంత్రం వేళ కొన్ని చోట్ల చిరుజల్లులు కురిశాయి. అయినా భానుడి ప్రతాపం తగ్గలేదు. ఈ రెండు రోజులు కూడా 41 డిగ్రీలకుపైగా నమోదైంది. రోహిణీ కార్తె వెళ్లిపోయిన తర్వాత కూడా జిల్లాలో గరిష్టంగా 44 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదవుతూ వస్తున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా చాలా ప్రాంతాల్లో సాధారణ వర్షపాతం కూడా నమోదు కాలేదు. దుక్కులు దున్నేందుకు రైతన్నలు ఎదురుచూపులు చూస్తున్నారు.

- రెండు రోజులుగా మబ్బులు..
- అక్కడక్కడా చిరుజల్లులే
- నైరుతి జాప్యం..ప్రజలకు తప్పని ఉష్ణతాపం
- జూన్ మూడో వారంలోనూ మండుతున్న ఎండలు
- గరిష్టంగా 44 డిగ్రీల ఉష్ణోగ్రతతో వేసవి సెగలు
- ఖరీఫ్ సాగుకు వర్షాల కోసం రైతాంగం ఎదురుచూపులు
- బోర్ల కింద పంటల సాగుకు సన్నాహాలు



ఒంగోలు నగరంలో సోమవారం సాయంత్రం కురుస్తున్న వాన

ఒంగోలు సబర్బన్:

ఏరువాక ప్రారంభమైంది.. ఖరీఫ్ సీజన్ మొదలైంది.. అయినా నైరుతి రుతుపవనాలు వెనకడుగు వేశాయి. తొలకరి దోబూచులాడుతోంది. భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తూనే ఉన్నాడు. దీంతో ఎండలు మండిపోతున్నాయి. నైరుతీ రుతుపవనాలు కొంత ఆలస్యమైనా వారం రోజుల కిందట రాయలసీమను తాకాయి. అయినా వాటి ప్రభావం జిల్లా వాతావరణం మీద పెద్దగా చూపటం లేదు. అరేబియా సముద్రంలో వరుసగా రెండు తుఫాన్లు రావటంతో నైరుతీ రుతు పవనాలకు ప్రతిబంధకాలుగా మారాయి. వరుసగా వచ్చిన మోకా, బిపర్ జోయ్ తుఫాన్ల వల్ల నైరుతి రుతుపవనాలు కూడా వాతావరణాన్ని చల్లబరచలేకపోతున్నాయి. దీంతో ఒంగోలు నగరంతో పాటు జిల్లాలో 44 డిగ్రీల ఉష్ణోగ్రతతో ప్రజలు మలమల మాడిపోతున్నారు. ఇక జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో 46 డిగ్రీల స్థాయి ఉష్ణోగ్రతలతో ప్రజలు బయటకు అడుగు పెట్టాలంటే భయపడుతున్నారు. మరో పక్క ఇళ్లల్లో ఉక్కపోతతో సతమతమవుతున్నారు.

సాధారణ వర్షపాతం కూడా కష్టమే..

ఖరీఫ్ సీజన్ ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభమైంది. ఏరువాకకు ముందే వర్షపు జాడలు కనపడేవి. అలాంటిది తుఫాన్ల కారణంగా నైరుతి రుతుపవనాలు మందగించటంతో వర్షపు ఛాయలు కనుమరుగయ్యాయి. దీంతో ఈ నెలలో కురవాల్సిన సాధారణ వర్షం కురవక పోవటంతో పంటల సాగుకు రైతులు ఎదురు చూస్తున్నారు. సాధారణంగా జూన్‌లో 57.9 మిల్లీ మీటర్ల వర్షం కురవాల్సి ఉంది. అలాంటిది 20వ తేదీ వస్తున్నా సాధారణ వర్షపాతం కూడా నమోదు కాలేదు. గతేడాది ఇప్పటికే సాధారణ వర్షపాతం 42 మిల్లీ మీటర్లు నమోదైంది. దీంతో పంటల సాగుకు రైతులు ముందుగానే ఉపక్రమించారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 4,43,799 ఎకరాల్లో వివిధ రకాల పంటల సాగు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ లక్ష్యంగా నిర్దేశించింది.

రాత్రి వేళలో కూడా తగ్గని సెగ...

భానుడి ప్రతాపానికి పగలు సరేసరి. రాత్రి వేళలో కూడా సెగ తగ్గటం లేదు. దీంతో ప్రజలు ఉక్కపోతకు గురవుతున్నారు. రాత్రి 9 గంటల వరకు కూడా సెగగాలులు తగ్గటం లేదు. రోహిణీలో కూడా ఈ స్థాయి ఎండలు ఠారెత్తించలేదు. రోహిణీ కార్తె ఈ నెల 8వ తేదీతో వెళ్లిపోయింది. మృగశిర కార్తె కూడా వచ్చేసింది. ఆ తర్వాత కూడా సూర్యుడి ప్రతాపంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దాదాపు 15 రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు 44, 43 డిగ్రీలు నమోదయ్యాయి. దీంతో జిల్లా వాసులు అల్లాడిపోయారు. 15 నుంచే ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావాల్సి ఉంది. ఇప్పటికే ఏరువాకను ప్రారంభించుకున్న జిల్లా రైతాంగం ఇప్పటికే పంటలు సాగు చేయటం ప్రారంభించారు. ఖరీఫ్ సీజన్ కోసం బోర్ల కింద ఆయా ప్రాంతాల్లో ఆరుతడి పంటల సాగుకు ఉపక్రమించారు.

ఒంగోలులో వడగళ్ల వాన....

ఒంగోలు నగరంతో పాటు పరిసర ప్రాంత మండలాల్లో సోమవారం సాయంత్రం వడగళ్ల వాన కురిసింది. దాదాపు అరగంట పాటు ఈదురు గాలులతో కూడిన వర్షం, వడగళ్లు పడ్డాయి. ఈదురు గాలులకు కొన్ని ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. విద్యుత్ లైన్లమీద పడటంతో నగరంలోని కొన్ని ప్రాంతాల్లో 3 గంటకు పైగా విద్యుత్ అంతరాయం ఏర్పడింది. రెండు రోజులుగా వర్షపు జల్లులు జిల్లా వ్యాప్తంగా అక్కడక్కడా పడుతున్నాయి. అయినా వేసవి తాపాన్ని మాత్రం తగ్గించలేకపోతున్నాయి. నైరుతి ఎప్పుడు వస్తుందా అని అన్నదాతలతో పాటు ప్రజలు ఆశగా ఆకాశంవైపు ఎదురుచూస్తున్నారు.



వర్షంలో ద్విచక్రవాహనదారుడు

అర్హులకు సంక్షేమ పథకాలు

- జగనన్న సురక్షపై సమీక్షలో కలెక్టర్ దినేష్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలతోపాటు అన్ని ప్రభుత్వ సేవలు విధిగా అందించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి జేసీ కె.శ్రీనివాసులుతో కలిసి జగనన్న సురక్షపై మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. కార్యక్రమ పర్యవేక్షణకు మండల స్థాయిలో రెండు బృందాలను ఏర్పాటు చేస్తామన్నారు. వీరు సచివాలయాల్లో క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజల సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. క్యాంపు నిర్వహించేందుకు వారం రోజుల ముందు ఆయా సచివాలయాల పరిధిలో వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి అర్హత ఉండి సంక్షేమ పథకాలు పొందలేకపోయినవారిని, ఇతర సమస్యలను గుర్తించాలన్నారు. అవసరమైన ధ్రువపత్రాలు తీసుకుని సచివాలయంలో అర్జీ నమోదు చేయాలని చెప్పారు. ప్రజల వద్ద సరైన సర్టిఫికెట్లు లేకుంటే వారితో వెంటనే దరఖాస్తు చేయించాలని సూచించారు. క్యాంపు నిర్వహించే రోజు మండల ప్రత్యేక బృందంతో సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు కచ్చింతంగా ఉండాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులను కార్యక్రమానికి ఆహ్వానించాలని స్పష్టం చేశారు. అవకాశం ఉంటే ప్రజా సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించాలని, లేదంటే నిర్దిష్ట తేదీని తెలియజేస్తూ రశీదు ఇవ్వాలన్నారు.

విద్యతోనే పేదరికం దూరం

- అందుకే పేద పిల్లల చదువుకు ప్రభుత్వం అత్యధిక వ్యయం
- జగనన్న ఆణిముత్యాల కార్యక్రమం విద్యార్థులకు ప్రోత్సాహకం
- జగనన్న ఆణిముత్యాలు ఒంగోలు నియోజకవర్గ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బాలినేని



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు మెడల్, ప్రశంస పత్రం, నగదు పురస్కారం అందజేస్తున్న ఎమ్మెల్యే, మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: విద్యతోనే పేదరికం దూరమవుతుందని, పేదింటి బిడ్డలకు చదువు భారం కాకూడదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశ్వసిస్తున్నారని మాజీమంత్రి, స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం లాయరు పేటలోని తన నివాసంలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా ఒంగోలు మండలం, కొత్తపట్నం మండలాల నుంచి వరుస స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో విద్యార్థులకు ప్రభుత్వం ఎంత అయితే ఇస్తుందో అంతే మొత్తాన్ని తాను కూడా స్వయంగా అందిస్తున్నట్లు ప్రకటించారు. విద్యాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి ప్రత్యేకంగా నాడు–నేడు మనబడి, జగనన్న అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక పాఠశాల ప్రారంభమైన తొలిరోజే విద్యార్థులకు అందిస్తున్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. కేవలం ఓట్లు రాబట్టుకోవడం కోసం ప్రభుత్వాలు ఖర్చుచేయడం చూశాం కానీ, ఓటు హక్కు కూడా లేని చిన్నారులకు పెద్ద ఎత్తున నిధులు వ్యయం చేయడం అంటే పేదరికంలో మగ్గుతున్న వారి జీవితాల్లో ఆర్థిక పరిపుష్టిని పొందాలనేదే సీఎం ధ్యేయం అన్నారు. ఆంగ్లమాధ్యమాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెడితే ప్రతిపక్షాలు గగ్గోలు పెట్టాయన్నారు. కానీ సీఎం మాత్రం పేద పిల్లలు ఆర్థికంగా ఎదగాలంటే ఆంగ్ల మాధ్యమం అవసరాన్ని గుర్తించి ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టారన్నారు. విద్యార్థులంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఒంగోలు ఎంపీపీ మల్లికార్జునరెడ్డి, ఎంఈవో కిషోర్‌బాబు, సమగ్ర శిక్ష ఏఎల్‌ఓ సుబ్బారావు, వ్యవసాయ సలహామండలి జిల్లా చైర్మన్ ఆళ్ల రవీంద్రారెడ్డి, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధి ఉండాలి

- అర్జీలు రీ ఓపెన్ కాకుండా చూడాలి
- స్పందన నిర్వహించిన కలెక్టర్ దినేష్‌కుమార్



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ కె.శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధితో వ్యవహరించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్పందన భవనంలో స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తొలుత డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం ద్వారా దూర ప్రాంత ప్రజల సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్పందనలో వచ్చిన అర్జీలు రీ ఓపెన్ కాకుండా క్షేత్ర స్థాయిలో పరిష్కరించాలన్నారు. ప్రతి అర్జీకి ప్రాధాన్యత ఇచ్చి నిర్ధీత సమయంలో పరిష్కారం చూపాలని సూచించారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా అధికారులు పనితీరు మార్చుకోవాలన్నారు. అర్జీలు పరిష్కారం కాకుంటే కారణాలను అర్జీదారులకు వివరించాలని చెప్పారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌ఓ శ్రీలత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లోకేశ్వరరావు, నారదముని, ఐసీడీఎస్ పీడీ మాధురి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

- మార్కాపురం మండలం నాయుడుపల్లి గ్రామానికి చెందిన నారాయణరెడ్డి తాను వికలాంగుడినని, పింఛన్ ఇప్పించాలని కోరుతూ అర్జీ అందజేశారు. సంబంధిత అధికారులకు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.
- అర్ధవీడు మండలం పాపినేనిపల్లి గ్రామానికి చెందిన పెద లింగమూర్తి డయల్ యువర్ కలెక్టర్‌కు ఫోన్ చేసి తన పొలానికి వెళ్లేందుకు దారి ఇప్పించాలని కోరాడు. దీనిపై విచారణ జరిపి అర్జీదారుని సమస్యలను పరిష్కరించాలని తహశీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు.
- హనుమంతునిపాడు మండలం చినుప్పలపాడు గ్రామానికి చెందిన మురళీధర్ రెడ్డి తనకు అర్హత ఉన్నా జగనన్న ఆణిముత్యాలు అవార్డు ఇవ్వలేదని కలెక్టర్‌కు తెలిపారు. పరిశీలించి న్యాయం చేయాలని కోరాడు. పరిశీలించి న్యాయం చేయాలని డీఈఓకు కలెక్టర్ సూచించారు.

ప్రజల మనసు గెలిచి.. పురస్కారం పొంది

- ఉత్తమ పోలీసు స్టేషన్‌గా హనుమంతునిపాడు పీఎస్‌ను గుర్తించిన కేంద్ర హోంశాఖ

హనుమంతునిపాడు / ఒంగోలు టౌన్:

శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో అత్యుత్తమ పనితీరు కనబరిచి జాతీయ స్థాయిలో ఉత్తమ పోలీస్‌స్టేషన్‌గా గుర్తింపు తెచ్చుకుంది జిల్లాలోని హనుమంతునిపాడు పోలీస్‌స్టేషన్. 9 రకాల అంశాలను పరిగణలోకి తీసుకుని, ప్రజల అభిప్రాయాలను సేకరించి 2022 సంవత్సరానికి గాను ఉత్తమ పోలీసు స్టేషన్ గా ఎంపిక చేస్తూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం డీజీపీ చేతుల మీదుగా ఎస్పీ మల్లికా గర్గ్, ఎస్ఐ కృష్ణ పావని, సిబ్బంది పురస్కారాన్ని అందుకున్నారు.

మండల కేంద్రానికి దూరంగా ఉన్నా..

1927వ సంవత్సరం బ్రిటీషు పాలనలో కొండ శివారు గ్రామమైన నందనవనంలో పోలీస్‌సేష్టన్‌ను ఏర్పాటు చేశారు. 1984లో మండలాలు ఏర్పాటైన తర్వాత దీనిని హనుమంతునిపాడు మండల కేంద్రానికి మార్చారు. అయితే పురాతన భవనంలో తుపాకులు, ఇతర సామగ్రికి, సిబ్బందికి నక్సల్స్ నుంచి ముప్పు పొంచి ఉందన్న కారణంతో 2004లో కనిగిరి పాత పోలీస్‌స్టేషన్‌లోకి మార్చారు.



హనుమంతునిపాడు పోలీస్‌స్టేషన్

దాదాపు పదేళ్లకుపైగా మండల కేంద్రానికి దూరంగా నియోజకవర్గ కేంద్రంలో హెచ్‌ఎంపాడు పీఎస్ కొనసాగుతోంది. స్టేషన్ పరిధిలో 23 గ్రామ పంచాయతీల్లో 14 సచివాలయాల కింద 62 హ్యాబిటేషన్ గ్రామాలున్నాయి.

కనిగిరిలోని పోలీస్‌స్టేషన్ భవనం నుంచే కార్యకలాపాలు నిర్వహిస్తున్న సిబ్బంది మండలానికి దూరంగా ఉన్నా విధి నిర్వహణలో చిత్తశుద్ధితో వ్యవహరించారు. ఉన్నతాధికారుల సూచనలతో ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ తమ శక్తిమేర సేవలందించారు. అన్ని వర్గాల ప్రజల నుంచి సెభాష్ అనిపించుకున్నారు. గతేడాది ఆగస్టు 28వ తేదీన కేంద్ర బృందం సర్వే చేసింది. ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించింది. కేంద్ర బృందం ద్వారా ప్రశంసలందుకుని పురస్కారానికి అర్హత సాధించారు.



డీజీపీ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఎస్పీ మలికాగర్గ్, హెచ్‌ఎంపాడు ఎస్సై కృష్ణపావని

కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పరిగణలోకి తీసుకున్న అంశాలు:

- నేరాల నియంత్రణ
- లా అండ్ ఆర్డర్ నిర్వహణ
- చట్టాల అమలు
- కేసుల దర్యాప్తు, విశ్లేషణ
- కోర్టు సమన్లు, కోర్టు మానిటరింగ్
- ప్రోయాక్టివ్ పోలీసింగ్
- కమ్యూనిటీ ఎంగేజ్మెంట్
- పెట్రోలింగ్ నిర్వహణ
- పచ్చదనం, పరిశుభ్రత



సర్టిఫికెట్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ

శ్రమకు గుర్తింపు లభించింది

హనుమంతునిపాడు పోలీసు స్టేషన్‌కు ఉత్తమ పోలీసు స్టేషన్‌గా కేంద్ర హోం శాఖ నుంచి అవార్డు రావడం ప్రకాశం జిల్లా పోలీసుల శ్రమకు తగిన గుర్తింపు లభించినట్లు భావిస్తున్నాను. ముఖ్యంగా హనుమంతునిపాడులో ఎస్ఐగా విధులు నిర్వహించిన కృష్ణ పావని నిబద్ధత కలిగిన అధికారి. ఆమె పనితీరు చాలా బాగుంది. ఆమెతో పాటుగా అక్కడ పనిచేస్తున్న పోలీసు సిబ్బంది అంకితభావంతో పనిచేయడంతోనే ప్రజల, ప్రభుత్వ ప్రశంసలు పొందారు.

– ఎస్పీ మలికా గర్గ్

మరింత స్ఫూర్తినిచ్చింది

ఈ అవార్డు నాకు మరింత స్ఫూర్తినిచ్చింది. ఎస్పీ మలికా గర్గ్ ఇచ్చిన మద్దతు, సూచనలు, సలహాలు నాకు ఎంతో ఉపయోగపడ్డాయి. ఫిర్యాదు వచ్చిన వెంటనే స్పందించడం, ప్రజలతో సానుకూలంగా వ్యవహరించడంతో పాటుగా బాధితులకు న్యాయం చేయడానికి శక్తిమేర ప్రయత్నించడం మా పోలీసు స్టేషన్‌కు మంచి గుర్తింపు తెచ్చింది. ఈ విషయాన్ని మండల ప్రజలు కేంద్ర హోం శాఖ బృందం దృష్టికి తీసుకెళ్లారు. ఈ అవార్డు రావడానికి సహచర పోలీసు సిబ్బంది, మండల ప్రజల తోడ్పాటును ఎప్పటికీ మరచిపోలేను.

– కృష్ణ పావని, ఎస్ఐ

అన్ని వర్గాల సంక్షేమమే జగనన్న లక్ష్యం



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

- మంత్రి ఆదిమూలపు సురేష్
- వై.చర్లోపల్లిలో ఉత్సాహంగా గడప గడపకు మన ప్రభుత్వం

పెద్దదోర్నాల: అన్ని వర్గాల సంక్షేమమే జగనన్న లక్ష్యమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. మండల పరిధిలోని వై.చర్లోపల్లిలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఆదిమూలపు సురేష్ ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాలనపై ప్రజల స్పందన, స్థానికంగా ఉన్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులను ఇంటింటికీ తీసుకెళ్లి ప్రభుత్వం అందించిన పథకాల వివరాలు తెలియజేశారు. అనంతరం మంత్రి సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజాప్రతినిధులు నేరుగా ప్రజల వద్దకు వెళ్లి వివరించడం, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు వారధిగా ఈ కార్యక్రమం ఉందన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న ప్రతి పథకాన్ని వలంటీర్ల ద్వారా ప్రజలకు వారి ఇంటి వద్దనే అందించటం హర్షణీయమని కొనియాడారు. ప్రభుత్వ పథకాలతో కూడిన కరపత్రాలను ప్రతి కుటుంబంలోని పెద్దలకు అందజేసి వారు ప్రభుత్వం నుంచి ఎంత లబ్ధి పొందారో వివరించారు. ప్రతి ఇంటివారు రెండు, మూడు పథకాలతో లబ్ధి పొందామని ఈ సందర్భంగా ఆనందం వ్యక్తం చేశారు. మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుంటే పథకాలన్నీ సక్రమంగా అందుతాయని మంత్రి వారికి వివరించారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ సాయికుమార్, ఎంపీడీవో విజయ, దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ దూదేకుల ఖాశింపీరా, ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, అల్లురాంభూపాల్‌రెడ్డి, గాలెయ్య, డి.ఆంజనేయరెడ్డి, మండల నాయకులు గుమ్మా పద్మజా యల్లేష్, దుమావత్ లతాచంద్ర కాంత్‌నాయక్, ఏపీవో అన్నపూర్ణ, పంచాయతీ ఈఓ.మోహనరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఈవీఎం గోడౌన్ల తనిఖీ



ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: స్థానిక మామిడిపాలెంలోని ఈవీఎం గోదాములను కలెక్టర్ దినేష్‌కుమార్ సోమవారం పరిశీలించారు. నెలవారీ తనిఖీల్లో భాగంగా గోదాములకు వెళ్లిన కలెక్టర్ ఈవీఎం యంత్రాలతో పాటు షట్టర్‌లకు వేసిన సీళ్లను, భద్రతా చర్యలను పరిశీలించారు. గోదాముల వద్ద ఏవైనా సమస్యలున్నాయా అని భద్రతా అధికారులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్‌తో పాటు ఎన్నికల విభాగం అధికారులు ఉన్నారు.

రూర్బన్ పనుల పరిశీలన



రూర్బన్ పనులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

సింగరాయకొండ: మండలంలో చేపట్టిన రూర్బన్ పనులను సోమవారం కేంద్ర బృందం పరిశీలించింది. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో వాటర్‌ప్లాంట్, సైకిల్ స్టాండ్, ఈద్గామిట్ట, మల్లెతోటలోని అండర్ డ్రైనేజీ, రోడ్లు, రైల్వేస్టేషన్ రోడ్డులోని డివైడర్, బుంగ బావి చెరువు కట్టపై వాకింగ్ ట్రాక్, ఓవర్‌హెడ్ ట్యాంక్, కందుకూరు రోడ్డులోని చేపలమార్కెట్‌ను కేంద్ర బృంద సభ్యులు పరిశీలించారు. రూర్బన్ మిషన్ అసిస్టెంట్ డైరెక్టర్ కేఎం బాలాజీ, స్టేట్ కోఆర్డినేటర్ శ్రీనాథ్, ఎస్‌పీఎంయూ కన్సల్టెంట్ వినోద్, ఎంపీడీఓ షేక్ జమీఉల్లా, పంచాయతీరాజ్ ఏఈ శ్రీహరి, గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వడదెబ్బకు ఒకరు మృతి

తాళ్లూరు: మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన తూము కోటిరెడ్డి (70) అనే వ్యక్తి వడదెబ్బతో సోమవారం మృతి చెందాడు. తన పొలంలో పనులు నిమిత్తం ఉదయం వెళ్లిన కోటిరెడ్డి మధ్యాహ్న భోజనానికి ఇంటికి రాకపోయే సరికి భార్య నాగేశ్వరమ్మ కుమారుడు రమణారెడ్డికి విషయం తెలిపింది. దీంతో పొలం వద్దకు వెళ్లి చూడగా వడదెబ్బ తగిలి పడిపోయి ఉన్నాడు. పక్కనే చెత్త తగలబెడుతున్న నిప్పు కూడా ఉండటంతో కాలు, చెయ్యి కాలి ఉన్నాయి. గమనించిన కుమారుడు నీరు తాగించేందు ప్రయత్నించగా అపస్మారక స్థితిలోనికి వెళ్లి మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

కారు ఢీకొని మాజీ సర్పంచ్ మృతి



పెద్దఖాశింపీరా(ఫైల్)

కొమరోలు: సైకిల్‌ను కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన మాజీ సర్పంచ్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందారు. పోలీసుల కథనం మేరకు.. కొమరోలు మండలంలోని ఇడమకల్లు గ్రామానికి చెందిన పెద్దఖాశింపీరా(74) ఆదివారం అర్ధరాత్రి స్వగృహానికి అమరావతి–కడప రాష్ట్రీయ రహదారిపై సైకిల్‌పై వెళ్తుండగా యర్రంశెట్టివానిపల్లె క్రాస్‌రోడ్డు వద్ద వేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. తీవ్రగాయాలతో పడి ఉన్న ఖాశింపీరాను బంధువులు గిద్దలూరు వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం మార్కాపురం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై ఎ.సుబ్బరాజు పరిశీలించి వివరాలు సేకరించారు. ప్రమాదానికి కారణమైన కారును పోలీసుస్టేషన్‌కు తరలించారు. మృతుడి కుమారుడు ఖాశింపీరా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

అదిగో పెద్దపులి.. ఇదిగో చిరుత!

భయాందోళనలో అర్ధవీడు మండల ప్రజలు



చింతమల్లెలపాడు సమీపంలో ట్రాప్ కెమెరా ఏర్పాటు చేస్తున్న ఫారెస్ట్ అధికారి

అర్ధవీడు(కంభం): అర్ధవీడు మండలంలోని అయ్యవారిపల్లి అటవీప్రాంతం సమీపంలో పెద్దపులితోపాటు చిరుత కూడా సంచరిస్తోందన్న సమాచారం స్థానిక ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. జనవరి నెలలో అర్ధవీడు మండలంలోని మాగుటూరు, లక్ష్మీపురం, కాకర్ల పరిధిలో పెద్దపులి సంచరిస్తూ ఓ ఎద్దును చంపడం, మరో ఎద్దుపై దాడి చేసిన విషయం తెలిసిందే. పులి జాడ కోసం ట్రాప్ కెమెరాలు అమర్చిన అటవీశాఖ అధికారులు దాని కదలికలను గుర్తించారు. గత నెలలో నాగులవరం సమీపంలో కంభం చెరువు వద్దకు పెద్దపులి వచ్చి మంచినీరు తాగి వెళ్లడాన్ని గమనించిన స్థానికులు వెంటనే అటవీశాఖ అధికారులకు తెలియజేశారు. పెద్దపులి పాదముద్రలను సేకరించిన అధికారులు.. నీరు తాగేందుకు వచ్చి మళ్లీ అడవిలోకి వెళ్లిపోయిందని చెప్పడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. అయితే, తాజాగా అయ్యవారిపల్లి సమీపంలోని చింతమల్లెలపాడు సమీపంలో పెద్దపులితోపాటు చిరుత సంచరిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. నీటి కుంట వద్ద పులి మంచినీరు తాగి వెళ్లినట్లు మేకల కాపరులు గుర్తించారు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం ఫారెస్ట్ అధికారులు చింతమల్లెలపాడు సమీపంలోని అటవీ ప్రాంతంలో పర్యటించి ప్రజలకు పలు సూచనలు చేశారు. పులి కదలికలు తెలుసుకునేందుకు మరోమారు ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. అడవిలోకి వెళ్లే వారు జాగ్రత్తగా ఉండాలని చెప్పారు.

బరితెగించిన పచ్చ దండు

- వైఎస్సార్ సీపీ సానుభూతిపరులపై దాడి
- కళ్లల్లో కారం కొట్టి.. కర్రలు, ఇనుప రాడ్లు, రాళ్లతో హల్‌చల్
- ఒకరి పరిస్థితి విషమం.. పలువురికి తీవ్రగాయాలు
- పెద్దారవీడు మండలం తోకపల్లిలో ఘటన



ఉప్పలపాటి సుధాకర్ ఇంటి ముందు మోటర్ సైకిల్‌పై టీడీపీ వర్గీయుల రాళ్ల దాడి



గాయాలైన ఉప్పలపాటి సందీప్‌తో మాట్లాడుతున్న ఎస్‌ఐ పులి రాజేష్

పెద్దారవీడు: నూతనంగా పాస్టర్‌ను ఎన్నుకోవాలని, చర్చికి సంబంధించిన నిల్వ డబ్బుల జమా ఖర్చులు చెప్పాలని అడగడంతో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై టీడీపీ వర్గీయులు కర్రలు, రాళ్లతో దాడి చేశారు. ఈ సంఘటన పెద్దారవీడు మండలం తోకపల్లిలో ఆదివారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసుల తెలిపిన వివరాలు.. గ్రామంలో పాస్టర్ నియామకం, చర్చికి సంబంధించిన డబ్బుల జమా ఖర్చుల విషయంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ నేతల మధ్య రెండేళ్లుగా గొడవలున్నాయి. గతేడాది డిసెంబర్ 25న క్రిస్మస్ సందర్భంగా ఇరు వర్గాల పెద్దలు కూర్చొని దూపాడు గ్రామానికి చెందిన పాస్టర్ బాబు ఆధ్వర్యంలో పండుగను ప్రశాంతంగా జరుపుకొన్నారు. ఎన్నుకున్నాకే పాస్టర్‌ను చర్చిలోకి అనుమతిద్దామని ఇరు వర్గాల పెద్దలు నిర్ణయించుకున్నారు. అందరం కలిసి నిర్ణయించాకే చర్చిలోకి రావాలని పాస్టర్ బాబుకు వైఎస్సార్‌సీపీ వర్గం వారు చెప్పారు. అయితే వారి మాట వినకుండా టీడీపీ వర్గం వారు పిలిచినప్పుడు పాస్టర్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్నారు. దీనిపై పాస్టర్‌ను ప్రశ్నించామని, అలాగే ఉప్పలపాటి పొట్టయ్య దగ్గర చర్చి డబ్బులు రూ.2 లక్షలు ఉండటంతో జమా ఖర్చులు చెప్పాలని ప్రశ్నించామని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ సర్పంచ్ ఉప్పలపాటి కాశయ్య తెలిపారు. కాగా, యర్రగొండపాలెం మండలం గురిజేపల్లిలో శనివారం ఓ సంఘం వారు పాస్టర్‌ను నియమించుకునే కార్యక్రమానికి టీడీపీ వర్గం పెద్దలు హాజరు కాగా, వైఎస్సార్‌సీపీ పెద్దలు హాజరు కాలేదు. పాస్టర్ బాబు టీడీపీ వర్గం వారి మాటలు వింటున్నారని.. అందరికీ అనుకూలంగా ఉన్న పాస్టర్‌ను ఎన్నుకుందామని వైఎస్సార్‌సీపీ నేతలు కోరారు. దీంతో ఆగ్రహించిన టీడీపీ నేతలు ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్లపై ఇనుప రాడ్లు, కర్రలు, గొడ్డలు, కత్తులతో దాడి చేశారు. కనిపించిన వారిని కనిపించినట్టుగా కళ్లల్లో కారం జల్లి కర్రలు, రాళ్లు, ఇనుప రాడ్లతో దాడి చేశారు. ఈ దాడుల్లో వెంకటయ్య, సందీప్, పోలయ్య, నాసరయ్య, సాగర్, పిచ్చయ్య, చిన్నగాలెయ్య, శ్యామ్, దీనమ్మ, దానమ్మలకు గాయాలయ్యాయి. బంధువులు వెంటనే వారిని మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. నాసరయ్య, సాగర్, పిచ్చయ్యల పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. విషయం తెలియడంతో ఎస్‌ఐ రాజేష్ గ్రామానికి చేరుకుని ఘటనకు గల కారణాలపై ఆరా తీశారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి, కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

హామీలన్నీ నెరవేర్చిన ఘనత జగన్‌దే

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కేపీ

తర్లుపాడు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పోతలపాడులో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. పథకాల ద్వారా లబ్ధిపొందిన వారికి బుక్‌లెట్ అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల హామీలను పూర్తిగా నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో రూ. 20 లక్షలతో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక నాయకులు బొర్రారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ చెన్నకేశవులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మురారి, సొసైటీ ప్రెసిడెంట్ సత్యనారాయణరెడ్డి, ఎంపీపీఓ నరసింహులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, సర్పంచ్‌లు పెద్ద మస్తాన్, టి.రమణారెడ్డి, రసూల్, రామిరెడ్డి, రమణయ్య, జాన్‌రత్నం, మీరయ్య, పి.వరాలు, ఎంపీటీసీలు పార్వతి రమేష్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, వి.అంకమ్మ, వైస్ సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, నాయకులు కొండారెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎదురు లేని నేత సీఎం వైఎస్ జగన్

- ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి

దర్శి: ప్రజలకు సంక్షేమం.. అభివృద్ధి రాజకీయ పార్టీలకు అతీతంగా అందించి దేశంలోనే ఎదురు లేని నేతగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎదిగారని ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆరో వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ పెద్దిరెడ్డి నారాయణరెడ్డి, నాయకులు డొంగరి రమేష్‌లు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. సంక్షేమ లబ్ధిని వివరించిన అనంతరం ప్రజల సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న చిన్నారి షేక్ షఫియాకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. రానున్న రోజుల్లో వైఎస్సార్ సీపీ 175కి 175 అసెంబ్లీ స్థానాలు గెల్చుకోవడం ఖాయమని చెప్పారు. గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ వైపీ సుబ్బయ్య, సొసైటీ అధ్యక్షుడు వేమిరెడ్డి చెన్నారెడ్డి, ఎంపీపీ సుధా అచ్చయ్య, కౌన్సిలర్‌లు మేడం మోహన్‌రెడ్డి, వీసీరెడ్డి, ఎంపీటీసీల సంఘ జిల్లా అధ్యక్షుడు వైఎస్సార్ సీపీ నాయకులు గోను నారాయణరెడ్డి, కేసరి ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం



లారీ ఢీకొని మృతి చెందిన కోటేష్

దర్శి: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని ఎర్రోబనపల్లి–బండి వెలిగండ్ల మార్గమధ్యంలో సోమవారం జరిగింది. స్థానికుల వివరాల మేరకు..కొనకనమిట్ల మండలం మునగపాడు గ్రామానికి చెందిన కత్తిపోగు కోటేష్(20) అనే యువకుడు తన వదినను కృష్ణాపురంలో స్కూటీ పై వదిలిపెట్టి తిరుగు ప్రయాణంలో రాజంపల్లి –ఎర్రోబనపల్లి మీదుగా మునగపాడు వెళుతున్నాడు. ఈ క్రమంలో వెనుక వైపు వస్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోలో నుంచి జారిపడి మరొకరు..

ఇదే రోడ్డులో ఆటోలో వస్తున్న కురంగి నాగయ్య(45) అనే వ్యక్తి బండి వెలిగండ్ల సమీపంలో ఆటోలో నుంచి జారి కింద పడ్డాడు. దర్శి ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడు పండ్ల వ్యాపారం చేస్తుంటాడు.

లారీ ఢీకొని యువతి మృతి



భార్య మృతదేహం వద్ద రోదిస్తున్న భర్త

ముండ్లమూరు: మండలంలోని పెద ఉల్లగల్లు వినుకొండ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దొద్దాల ప్రసన్న లక్ష్మీ (31) అక్కడికక్కడే మృతి చెందింది. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు. ముండ్లమూరుకు చెందిన దొద్దాల శేషగిరి భార్య ప్రసన్నలక్ష్మీతో కలిసి ద్విచక్ర వాహనంపై దర్శి మండలం శామంతపూడి గ్రామానికి సోమవారం ఉదయం బయలుదేరారు. మార్గమధ్యంలో దర్శి – అద్దంకి రహదారిలో పెద ఉల్లగల్లు వద్ద ద్విచక్ర వాహనంపై ఆగి షాపులో సామాగ్రి కొనుగోలు చేసేందుకు ఆగారు. అదే సమయంలో వెనక నుంచి వస్తున్న లారీ వెనక ఢీకొట్టింది. లారీ వెనక చక్రాలు తలపైకి వెళ్లడంతో తల భాగం నుజ్జు నుజ్జు అయింది. ప్రమాదంలో ప్రసన్నలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. భర్త శేషగిరికి ఎలాంటి గాయాలు కాలేదు. సమాచారం తెలుసుకున్న ప్రసన్నలక్ష్మి కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకొని బోరున విలపించారు. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతురాలు ముండ్లమూరులో వలంటీర్‌గా పనిచేస్తుంది. ఏఎస్సై పవన్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి కారలణాలను అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కోర్టు గుమస్తా ఆగడాలు భరించలేం

- చర్యలు తీసుకోవాలని వేములకోట వాసుల ధర్నా



ధర్నా చేస్తున్న వేములకోట గ్రామస్తులు

మార్కాపురం: 'ఆరేళ్లుగా కోర్టు గుమస్తా వేధింపులు భరించలేకపోతున్నాం. అతనిపై వెంటనే చర్యలు తీసుకోవాల'ని మార్కాపురం మండలం వేములకోటకు చెందిన ఎస్టీ, రజక, ముదిరాజ్ సామాజిక వర్గాల ప్రజలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట బహుజన సైన్యం నాయకుడు జనుమాల నాగయ్య, వైఎస్సార్ సీపీ నేత జంకె చిన వెంకటరెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ఎస్టీ, రజక, ముదిరాజ్ కులాలకు చెందిన 50 కుటుంబాల వారిని కోర్టు గుమస్తా మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్మించిన సీసీ రోడ్లపై నడవకూడదని, వాడుకనీరు, చెత్త తమ ఇంటి సమీపంలోకి రాకూడదని బెదిరిస్తున్నాడని ఆరోపించారు. రజకులను కులం పేరుతో దూషిస్తూ, మహిళలను అసభ్యంగా తిడుతున్నాడని, అందరినీ కోర్టుకు ఈడ్చుతానని బెదిరిస్తున్నాడని వాపోయారు. అతని నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను సబ్ కలెక్టర్ సేతుమాధవన్, డీఎస్పీ వీరరాఘవరెడ్డి, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో తుమ్మలయ్య, వెంకటసుబ్బులు, పెద్దకాశయ్య, హరికృష్ణ, శివనాగయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 88 ఫిర్యాదులు

- బాధితులకు భరోసా ఇచ్చిన ఎస్పీ మలికా గర్గ్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు టౌన్: స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 88 ఫిర్యాదులు వచ్చాయి. బాధితుల సమస్యలు నేరుగా విన్న ఎస్పీ మలికా గర్గ్.. సంబంధిత పోలీస్ స్టేషన్ల సిబ్బందితో మాట్లాడి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్పందన ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, అడిషనల్ ఎస్పీ(క్రైం) ఎస్‌వీ శ్రీధర్‌రావు, ట్రాఫిక్ డీఎస్పీ విక్రం శ్రీనివాసరావు, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, ఐసీసీఆర్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, ప్యానల్ అడ్వకేట్ బీవీ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఫిర్యాదుల్లో ప్రధానమైనవి పరిశీలిస్తే.. కుటుంబ అవసరాల కోసం గుంటూరుకు చెందిన ఎం.బసవమ్మ అనే మహిళ వద్ద ఇల్లు తాకట్టు పెట్టి 2 లక్షల రుపాయలు అప్పు తీసుకుని గడువులోగా అసలుతోపాటు వడ్డీ చెల్లించినా ఇంటి తాలూకు పత్రాలు ఇవ్వకుండా తిప్పుతోందని ఒంగోలుకు చెందిన వై.కొండయ్య ఫిర్యాదు చేశారు. అలాగే.. తన మూడంతస్తుల భవనానికి సెకండ్ హ్యాండ్ లిఫ్టు బిగిస్తానని 1.15 లక్షల రుపాయలు తీసుకుని మద్దిపాడు మండలానికి చెందిన అఖిల్ మోసం చేశాడని ఒంగోలుకు చెందిన వెంకట సుబ్బయ్య ఫిర్యాదులో పేర్కొన్నారు. మరికొందరు వ్యక్తిగత సమస్యలపై అర్జీలు అందజేశారు.





పామును నిలువరించిన శునకాలు

ఓ పాము తన దారిలో వెళ్తూ ఉండగా శునకాలు ఆ పామును గమనించి నిలవరించాయి. ఈ సంఘటన కొమరోలు మండలంలోని తాటిచెర్ల గ్రామంలో చోటు చేసుకుంది. నాగుపాము తాటిచెర్ల గ్రామ సమీపంలోని పొలాల వద్ద తన దారిలో తాను వెళుతూ ఉండగా ఆ పామును గమనించిన రెండు కుక్కలు దాని వద్దకు వెళ్లి మొరుగుతుండటంతో పాము అలాగే స్తబ్దుగా నిలబడింది. స్థానికంగా ఉన్న వారు ఈ సంఘటనను తమ కెమెరాలలో బంధించారు. పామును నిలువరించడానికి కుక్కలు దాదాపు ఓ గంటసేపు మొరగడంతో పాము వెనుదిరిగి వెళ్లిపోయింది.

– కొమరోలు

ప్రయాణికులతో వెళ్తున్న ఆటో బోల్తా



ప్రమాదంలో గాయపడ్డ ఆటో డ్రైవర్‌తో మాట్లాడుతున్న ఎస్సై



సంఘటనా స్థలంలో పడి ఉన్న దర్శికి చెందిన కుంచాల రంగస్వామి

- ఏడుగురికి తీవ్ర గాయాలు

కంభం: వేగంగా వెళ్తున్న ఆటో అదుపు తప్పి బోల్తా పడటంతో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం మండలంలోని పెద్దనల్లకాల్వ గ్రామ సమీపంలో జరిగింది. వివరాల్లోకి వెళితే..గిద్దలూరు నుంచి కంభం వైపు 10 మంది ప్రయాణికులతో వస్తున్న టాటా మ్యాజిక్ ఆటో నల్లకాల్వ సమీపంలో అదుపుతప్పి బోల్తాపడింది. ఆటోలో ప్రయాణిస్తున్న దర్శికి చెందిన కంచాల రంగస్వామి రాచవీడు మండలం చోళవీడుకు వచ్చి తిరిగి వెళ్తున్న సమయంలో ఈ ఆటో ఎక్కగా అతని ఎడమ చెయి మణికట్టు విరగడంతో పాటు కుడి చేతికి తీవ్రగాయమైంది. ఆటో నడుపుతున్న డ్రైవర్ రఫీకి ఎడమ చెయ్యి, మణికట్టు వద్ద తీవ్రగాయాలయ్యాయి. రాచర్ల మండల గౌతవరానికి చెందిన షేక్ ఖాసింబీ, యర్రబాలెం గ్రామానికి చెందిన తిరివీధి లక్ష్మయ్య, రాచర్ల మండలం ఆకవీడుకు చెందిన షేక్ ఖాసింవలి, హబూబ్‌బి, బేస్తవారిపేట మండలం బీబీకేపురానికి చెందిన గురక భాగ్యంలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా మెరుగైన చికిత్స కోసం ఇరువురిని నరసరావుపేటకు తరలించారు. కంభం ఎస్సై నాగమల్లేశ్వరరావు వైద్యశాలలో డ్రైవర్, ప్రయాణికులతో మాట్లాడి ప్రమాదానికి కారణాలు తెలుసుకున్నారు.